క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: టౌన్–2 సెక్షన్ పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ గంగారాం తెలిపారు. రాజీవ్‌చౌక్, బైపాస్ రోడ్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఎదురుగా, సీతారాంనగర్, విజయపురికాలనీ, విద్యానగర్, జాంబాగ్, మైసమ్మగడ్డ, గొల్లపల్లి రోడ్, తాతమ్మగుడి, దయాల్‌నగర్, రఘురాములకోట, అశోక్‌నగర్, సత్యనారాయణస్వామి టెంపుల్, రామాలయం టెంపుల్, ఎల్‌ఐసీ ఆఫీస్, ఓల్డ్ బస్టాండ్ ప్రాంతాల్లో ఉండదన్నారు.
పట్టణ శివారులోని ధరూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు దృష్ట్యా టౌన్–3 సెక్షన్ పరిధిలో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ తెలిపారు. భవాని నగర్, బుడిగజంగాలకాలనీ, అయ్యప్ప గుడి, శాంతినగర్, పద్మనాయక వద్ద, కరీంనగర్ డెయిరీ, కరీంనగర్ రోడ్, నర్సింగాపూర్ రోడ్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, ఎస్పీ ఆఫీస్, జయశంకర్ విగ్రహ ప్రాంతం, రామాలయం, అంతర్గాం రోడ్, హౌసింగ్ బోర్డు, క్యాంప్ చర్చి ప్రాంతాల్లో ఉండదన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

సారంగాపూర్: మండలంలో 2024–25 మధ్య కాలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జరిగిన పనులపై ఆదివారం నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు పర్యటిస్తాయని అధికారులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందాలు, ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో చౌడారపు గంగాధర్, ఎంపీవో సురేశ్‌రెడ్డి, సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, డీఆర్‌పీలు, ఏపీవో శ్రీలత పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల: కొండగట్టు అంజన్న ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. కోనేరులో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనం, ప్రసాదాల టికెట్ల ద్వారా రూ.1.71లక్షల ఆదాయం సమకూరింది.

కోటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.59వేలు

వెల్గటూర్: కోటిలింగాలలోని శ్రీకోటేశ్వర స్వామి ఆలయ హుండీలను శనివారం లెక్కించారు. రూ.59,553, మిశ్రమ బంగారం 9 గ్రాములు, మిశ్రమ వెండి 1.50కిలోలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ పరిశీలకులు ఎం.రాజమౌళి, దేవస్థాన చైర్మన్ రమేశ్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కళాశాలలో ఫన్ డే

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి ఆదేశాల మేరకు శనివారం ప్రిన్సిపాల్ కె.వేణు అధ్యక్షతన ఫన్ డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులతోపాటు క్రీడలు నిర్వహించారు. స్టూడెంట్స్ కౌన్సిలర్ డా.పి.తిరుపతి విద్యార్థులకు స్మార్ట్ లక్ష్యాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. స్పోర్ట్స్ ఇన్‌చార్జి బి.భాస్కర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న మాజీ ఎంపీటీసీ

కోరుట్ల రూరల్: యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన ఆరె సరిత అనే మహిళా రైతు వారం క్రితం మరణించగా.. వారి కుటుంబానికి రూ.5లక్షల రైతు బీమా చెక్కును మాజీ ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక సురేశ్ శనివారం అందించారు. నాయకులు చొప్పరి నారాయణ, ఆరె లక్ష్మీరాజం, చిన్న నర్సయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ టీవీ..



జగిత్యాలరూరల్: సంగంపల్లి జిల్లాపరిషత్, హబ్సీపూర్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శనివారం జగిత్యాల ఐడీబీఐ బ్యాంక్ అధికారులు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద 32 ఇంచుల స్మార్ట్ టీవీ, ఐపీఎఫ్ ప్యానల్‌ను అందజేశారు. ఐడీబీఐ రీజినల్ మేనేజర్ రాఘవేంద్ర, బ్యాంక్ మేనేజర్ భీమేశ్, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్, ఎంపీవో రవిబాబు, ప్రధానోపాధ్యాయులు పడాల రవీందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ఫిల్టర్ వితరణ

కోరుట్ల: కల్లూర్ రోడ్‌లోని గడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మినరల్ వాటర్ ఫిల్టర్ బహూకరించారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు శుద్ధ జలం అందించేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్ అందజేయడం అభినందనీయమన్నారు. గోనెపల్లి వీరయ్యగౌడ్–వజ్రమ్మ జ్ఞాపకార్థం బహూకరించారు.



జగిత్యాల: బతుకమ్మతో అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి, విద్యార్థులు



కోరుట్లలో కోలాటమాడుతున్న విద్యార్థులు



కోరుట్లలో..



మల్లాపూర్: హుస్సేన్‌నగర్‌లో ప్రాథమిక పాఠశాలలో కోలాటమాడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముందస్తు బతుకమ్మ సంబరాలు

పాఠశాలల్లో శనివారం విద్యార్థులు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం నుంచి బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా పండుగ నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆడి పాడారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ధర్మపురి: నేరెల్లలో..



పెగడపల్లిలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయినులు



మల్యాల: లంబాడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో..



కథలాపూర్: బొమ్మెన పాఠశాలలో..



ఇబ్రహీంపట్నం: కేజీబీవీలో..



జగిత్యాలరూరల్: తిప్పన్నపేటలో..



రాయికల్‌లో..



జగిత్యాలలో..

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

జగిత్యాల: సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అలియా మక్సూద్ అన్నారు. శనివారం విరూపాక్షి గార్డెన్స్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షిక వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
విద్యార్థులు తల్లిదండ్రుల పేరును నిలబెట్టాలని ఎస్ఎస్వీ డిగ్రీ కళాశాల చైర్మన్ శ్రీపాద నరేశ్ అన్నారు. కళాశాల వార్షిక వేడుకలు నిర్వహించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కథలాపూర్: మహిళలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యకరంగా ఉంటారని కోరుట్ల క్లస్టర్ వైద్యాధికారి విజయలక్ష్మి అన్నారు. శనివారం కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ–స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, గర్భిణులు, కిశోర బాలికలకు వైద్యులు చికిత్సలందించి అవగాహన కల్పించారు. వైద్యాధికారులు సింధూజ, రజిత, సీహెచ్‌వో వేణు, సూపర్‌వైజర్ శ్రీధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
ఇబ్రహీంపట్నం: స్వస్థ్ నారీ వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చెవి, ముక్కు, గొంతు వైద్య శిబిరం నిర్వహించారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్యశిబిరాన్ని తహసీల్దార్ వరప్రసాద్ ప్రారంభించారు. జిల్లా ప్రోగాం ఆఫీసర్ శ్రీనివాస్, డీసీవో రవీందర్, సీహెచ్‌వో విజయభాస్కర్, వైద్యాధికారి హరీశ్ పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయికల్: ఒడ్డెలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్వస్థ్ నారీ–స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మానసిక రోగ వైద్య నిపుణులు డాక్టర్ ఆశ 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ సతీశ్, ఎంపీవో సుష్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాగర్‌రావు, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాస్, ఉమారాణి, ఫార్మసిస్ట్ దీపిక పాల్గొన్నారు.

పోషకాహారంపై దృష్టి సారించాలి

జగిత్యాలరూరల్: గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై దృష్టి సారించాలని సీడీపీవో మమత అన్నారు. శనివారం మోరపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. ఏసీడీపీవో సనా సుల్తానా, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎస్‌ఎం శిరీష, శ్రీశైల, అంగన్‌వాడీ టీచర్లు పద్మారాణి, జమున, శైలజ, ఆశ కార్యకర్తలు హేమలత, సత్యవాణి, రేవతి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.
కొడిమ్యాల: చెప్యాల్ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలు, వారి తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి మాట్లాడుతూ.. పిల్లలు పెరిగే వయసులో పోషకాహారం అందించాలన్నారు. పిల్లలతో కలిసి బతుకమ్మ ఆడి ప్రతిజ్ఞ చేయించారు. ప్రైమరీ స్కూల్ టీచర్ మునుస్వారి, అంగన్వాడీ టీచర్ జ్యోతి, ఉమ, అంజలి పాల్గొన్నారు.



మోరపల్లిలో మాట్లాడుతున్న సీడీపీవో

పెగడపల్లి: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ పౌష్టికాహార మాసోత్సవాలను అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా నిర్వహించారు.

పింఛన్ల పెంపు ఎప్పుడు..?

సారంగాపూర్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 21 నెలలు గడుస్తున్నా.. ఎన్నికల మేనిఫెస్టోలో పింఛన్ల పెంపుపై ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీశ్‌మాదిగ అన్నారు. పెంబట్ల గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, సీహెచ్‌పీఎస్ నాయకులు పింఛన్ల పెంపుపై కరపత్రాలు చేతబూని ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కారోబార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.
మల్లాపూర్: ఆసరా, చేయూత పెన్షన్‌దారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెంచడంలో పూర్తిగా విఫలమయిందని వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు అప్పం చిన్నారెడ్డి అన్నారు. శనివారం నడికుడలో ఆసరా, చేయూత పెన్షన్‌దారులతో కలిసి పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యదర్శి సంతోషిణికి వినతిపత్రం అందించారు.



పెంబట్లలో పంచాయతీ కార్యాలయం ఎదుట నాయకులు

కథలాపూర్: చింతకుంట పంచాయతీ ఎదుట దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మధు, లక్ష్మీనారాయణ, లింబాద్రి, లస్మయ్య, నర్సయ్య, భూమయ్య పాల్గొన్నారు.
కోరుట్ల రూరల్: పింఛన్లు డబుల్ చేస్తామని ఎన్నికల ముందు మాట ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గద్దెనెక్కిన తర్వాత మాట తప్పిందని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపెల్లి లక్ష్మణ్ అన్నారు. నాగులపేట, సంగెం గ్రామాల్లో పింఛన్‌దారులతో కలిసి పంచాయతీలను శనివారం ముట్టడించారు.

స్వచ్ఛభారత్

మేడిపల్లి: ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా 15 రోజులపాటు సేవాపక్షం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు నాగం శివకుమార్ తెలిపారు. శనివారం భీమారం మండలం మోత్కురావుపేట గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. తిరుపతి, రాము, లింగంగౌడ్, బోయినపల్లి ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కూలీలందరికీ పనులు కల్పించాలి

వెల్గటూర్: గ్రామాల్లో కూలీలందరికీ పనులు కల్పించాలని డీఆర్‌డీఏ అధికారి రఘువరన్ అన్నారు. 2024–25లో ఉమ్మడి మండల పరిధిలోని 30 గ్రామాల్లో చేపట్టిన 1442 పనులకు శనివారం సామాజిక తనిఖీ నిర్వహించారు. తనిఖీ బృందాలు గుర్తించిన అంశాలను ప్రజావేదికలో చదివి విన్పించారు. మస్టర్ల నిర్వహణలో లోపాలు, ఈఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ హాజరులో లోపాలతో రూ.25,856 జరిమానా, రికవరీ చేయాలని ప్రిసైడింగ్ అధికారి మదన్మోహన్ ఆదేశించారు.

కార్యవర్గం ఎన్నిక

కోరుట్ల రూరల్: సంగెం గ్రామంలోని గీత కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోతుగంటి సత్యనారాయణగౌడ్, ఉపాధ్యక్షుడిగా పోతుగంటి శంకర్‌గౌడ్, డైరెక్టర్లుగా పోతుగంటి సత్యనారాయణగౌడ్, సుదవేణి భూమయ్యగౌడ్, పల్లి ప్రకాశ్‌గౌడ్, సుదవేణి జలెందర్‌గౌడ్, పోతుగంటి చిన్న భూమయ్యగౌడ్, వల్లకొండ గంగారాంగౌడ్, పెరుమండ్ల శ్రీనివాస్‌గౌడ్, మర్యాద రాములుగౌడ్, గ్రామ పెద్ద మనిషిగా వల్లకొండ పెద్ద మల్లయ్యగౌడ్ ఎన్నికయ్యారు.

యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా నరేశ్

మల్యాల: యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా చెప్పెల్లి నరేశ్‌ను నియమిస్తూ మండల అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి నియామక పత్రం జారీ చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నియామక ప్రతం అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి



రేచపల్లిలో పరిశీలిస్తున్న ఎంపీడీవో

సారంగాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు వేగం పెంచాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. శనివారం రేచపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి, నాయకులున్నారు.

పరామర్శ

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో పలువురు మృతిచెందగా.. బాధిత కుటుంబ సభ్యులను శనివారం మాజీ మంత్రి ఈశ్వర్ పరామర్శించారు. నామాపూర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొత్తూరి రవికుమార్, ల్యాగలమర్రి, ఎల్లాపూర్ గ్రామాల్లో ఆత్మహత్య చేసుకున్న గొల్లపల్లి కిషన్, మల్లారపు సుప్రియ, కీచులాటపల్లిలో గుండెపోటుతో మృతిచెందిన కొత్తపల్లి సత్తయ్య కుటుంబాలను పరామర్శించారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం

మల్లాపూర్: కాంగ్రెస్ కుటుంబ సభ్యులైన ప్రతీ కార్యకర్తకు అండగా నిలుస్తామని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. శనివారం పాతదాంరాజుపల్లి, మొగిలిపేట, కొత్త దాంరాజుపల్లి గ్రామాల్లో మాజీ ఎంపీపీ నల్ల రాజన్నతో కలిసి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని పాతబస్టాండ్‌లో శనివారం వేకువజామున పట్టణ ఎస్సై రవికిరణ్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులపైకి ఓ కారు దూసుకొచ్చింది. కారులో ఉన్న వారికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తుండగా పక్కకు నెట్టి.. గాయపరిచిన భీమారం మండల కేంద్రానికి చెందిన లింగాల దీపక్, లకుమల్ల కార్తీక్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

పెగడపల్లి: బతికపల్లికి చెందిన మన్నె నీరజ(40) అనారోగ్యంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నీరజ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చూపించుకుంటోంది. మందులు వాడినా కుదుటపడలేదు. జీవితంపై విరక్తి చెంది శనివారం ఉదయం ఇంట్లోనే ఉరేసుకుంది. ఆమె భర్త మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మల్లాపూర్: ముత్యంపేట శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మొగిలిపేటకి చెందిన అవుట్ల నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. మిత్రుడితో కలిసి మెట్‌పల్లికి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా.. ముత్యంపేటలో అదుపు తప్పి కిందపడిపోయారు. స్థానికుల సమాచారంతో బంధువులు వచ్చి నిజామాబాద్ తరలించారు.

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థులు



గంగం అల్క



మూర్తి

కథలాపూర్: మండలంలో ఇద్దరు విద్యార్థులు ఎంబీబీఎస్‌లో సీటు సాధించినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. కలిగోట గ్రామానికి చెందిన గంగం అల్క అనే విద్యార్థిని వరంగల్ జిల్లాలోని కాళోజీ నారాయణ మెడికల్ కళాశాలలో, చింతకుంట గ్రామానికి చెందిన మండల మూర్తి అనే విద్యార్థి హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాలలో సీటు సాధించారు.

భూపతిపూర్ వాసి..

రాయికల్: భూపతిపూర్ గ్రామానికి చెందిన కామని గంగోత్రి మెడిసిన్‌లో సీటు సాధించింది. ఉపాధ్యాయులు దాసరి రామస్వామి, లక్ష్మయ్య, కార్తీక్, సిరిపురం మహేశ్, శంకరయ్య అభినందించారు.



గంగోత్రి

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పేదలకు అన్యాయం

జగిత్యాల: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పేదలకు అన్యాయం జరిగిందని, ఆరు గ్యారెంటీల్లో ఒక్కటీ అమలు కాలేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తొలి విడత 4.5లక్షల ఇళ్లకు 1.50 లక్షల ఇళ్లు మాత్రమే నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందరికీ న్యాయంగా డబుల్‌బెడ్‌రూంలు ఇచ్చిందని, దళితులకు దళితబంధు మంజూరు చేశామన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఇల్లు కూల్చుకుంటే చివరికి నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. పైసలు ఇచ్చిన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత, హరిచరణ్‌రావు, మల్లేశం, గంగాధర్, ప్రణయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

వృద్ధులను విస్మరిస్తే చర్యలు

జగిత్యాల: వృద్ధులను విస్మరిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో మధుసూదన్ అన్నారు. శనివారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులు కుమారులు పోషించడం లేదని ఫిర్యాదు చేశారు. సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన తులసీ, జగిత్యాల రూరల్‌మండలం కన్నాపూర్‌కు చెందిన లచ్చవ్వ, జగిత్యాలకు చెందిన గౌరవ్వ కొడుకులు, కూతుళ్లు పట్టించుకోవడం లేదంటూ ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. వృద్ధులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని, నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వారి బంధువులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. హరి అశోక్‌కుమార్, పద్మజ, కొండయ్య పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు మోదీ దీపావళి కానుక

జగిత్యాల: జీఎస్టీ తగ్గింపు మోదీ దీపావళి కానుక అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు అన్నారు. శనివారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నాయకులు శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, గంగారాం పాల్గొన్నారు.

సన్మానం

జగిత్యాలరూరల్: పెగడపల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన గాలిపల్లి ఆనంద్‌కుమార్‌ను శనివారం జగిత్యాలలో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జగిత్యాల యూనిట్ ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్యాల భూమయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజేంద్రప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడు రాజేందర్‌రావు, ప్రచార కార్యదర్శి పంగ రాజేశం, డిప్యూటీ తహసీల్దార్ లాస్య, ఆర్ఐలు శ్రీనివాస్, జమున పాల్గొన్నారు.
ఇబ్రహీంపట్నం: తిమ్మాపూర్ గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో శనివారం బాధ్యతలు చేపట్టిన గ్రామ పాలన అధికారి లక్ష్మణ్‌ను మాజీ ఎంపీపీ దేవేందర్ సన్మానించి స్వాగతించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జగిత్యాలరూరల్: అనంతారం గ్రామానికి చెందిన గుర్రం మహేశ్ ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లి 2023లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడిది నిరుపేద కుటుంబం కావడంతో ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక, సంక్షేమ సంఘం ఫౌండర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మృతుడి కుమార్తెలు రిన్విత, వేదాన్షి పేరున పోస్టాఫీసులో రూ.లక్ష డిపాజిట్ చేసి బాండ్స్ అందజేశారు.

ట్రోఫీ ఆవిష్కరణ

కొడిమ్యాల: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం ప్యాక్స్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు మేన్నేని రాజానర్సింగారావు క్రికెట్ ట్రోఫీ ఆవిష్కరించారు. తన తల్లి ప్రేమలత స్మారకంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేశ్, రాపర్తి లక్ష్మణ్, డేవిడ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

23న ఇంటర్వ్యూలు

జగిత్యాల: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు, ఈనెల 23న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంప్లాయిమెంట్ అధికారి సత్తమ్మ తెలిపారు. ఎంఎస్ లాబోరేటరి హైదరాబాద్‌లో 100 ఖాళీల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్నవారు హాజరు కావాలన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళాలో అన్ని ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: ఇందిరమ్మ మైనార్టీ, మహిళా యోజన స్కీం కోసం మైనార్టీ మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి చిత్రు తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న ఈ పథకంలో 2025–26 సంవత్సరానికి ముస్లిం, సిక్కు, బుద్దిస్ట్, జైన్స్, పార్శస్, మైనార్టీ వాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చని, యూనిట్ విలువ రూ.50వేలుంటుందని, వంద శాతం సబ్సిడీ ఉంటుందన్నారు.

విద్యుత్ మోటార్లు చోరీపై కేసు

మల్యాల: మండల కేంద్రానికి చెందిన రైతు పోతరాజు బక్కయ్య వ్యవసాయ మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. తన వ్యవసాయ బావికి అమర్చిన మోటారు, కోటీ శంకర్ మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధితులు శనివారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశామన్నారు.

దుర్గామాతా ఆగమన్ ర్యాలీ ప్రారంభం

కోరుట్ల: శ్రీలక్ష్మీనారాయణస్వామి యూత్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన దుర్గామాతా ఆగమన్ ర్యాలీని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రారంభించారు.

ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు

జగిత్యాల: త్వరలోనే ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు వస్తాయని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత విరమణ చేయగా.. ఆమెను అభినందించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంనర్సింహారెడ్డి అన్నారు. ధర్మపురిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం దాత గురునాథం ప్రణీత్ వృంద టెక్నాలజీస్ సహకారంతో రూ.15వేల విలువ చేసే సీసీ కెమెరాలను ప్రారంభించారు.